6.6.1997 శుక్రవారం 12 పేజీలు సంపుటి:69 సంచిక:23 విడిప్రతి రూ.2.00లు Phone: 327354 Regd. No. HNL 18

# జమీన్‌రైతు

**ఇల్లు బాడుగకు ఇవ్వబడును**

నెల్లూరు సోమశేఖర పురంలోని కళ్యాణి ఫిలిమ్స్ ఆఫీసు ఎదురుగా వున్న పెద్దయిల్లు (డోరు నెం.16/953) ఆఫీసులకు గాని, నివాసములకు గాని, గోడౌన్‌లకు గాని బాడుగకు యివ్వబడును. వివరములకు

ఫోన్ నెం. 325245

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

# రైతులకు వల విసుర్తున్నారు!

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులలో తన పట్ల అభిమానం సంపాదించు కోవడానికి బృహత్ ప్రయత్నం ప్రారంభించారు. గ్రామాలలో పార్టీ స్థిరపడి, నిలకడగా వుండా లంటే రైతుల మద్దతు తప్పనిసరి అన్న సంగతి తెలిసిందే; కాని తన ఒకటిన్నరేళ్ల పరిపాలనలో ఆయన రైతులకు చాలా దూరమై పోయారు. తెలుగు దేశం ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలు రైతులకు అసంతృప్తి కల్గించాయి. విద్యుత్ ఛార్జీల పెంపకం వీటిలో తీవ్రాతి తీవ్రమైనది. దీనిపై చెలరేగిన ఆందోళనలు సమసి పోయినా అసంతృప్తి మాత్రం అట్లనే వుంది. ఒకవైపు విద్యుత్ కోత, ఇంకొక ప్రక్క రేట్ల పెంపకంతో రైతు విసిగిపోయి వున్నారు. రైతుకు గిట్టుబాటు ధర లేకపోవడం మరొక సమస్య. వ్యవసాయ ఖర్చులు పెరుగు తున్నాయే తప్ప వడ్ల ధరలో పెరుగుదల వుండడం లేదు. నీటి తీరువా పెంపు కూడా రైతును బాధించేదే.

**నీళ్ల సంఘాలు, రైతు సదస్సులతో గ్రామాలపై తెలుగుదేశం పట్టు బిగుస్తుంది!**

ఈ పరిస్థితులలో రైతుల నుంచి అభిమానం చూరగొనడం కోసం ఆయన రాష్ట్ర వ్యాప్తంగా రైతు సదస్సులు జరిపించ బోతున్నారు. ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఈ సదస్సులు జరుగుతాయి. ఒక్కొక్క సదస్సుకు కనీసం 30 వేల మంది రైతులు హాజరౌతారనే అంచనాతో భోజన ఏర్పాట్లు, వేదిక నిర్మాణం చేస్తారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులూ ఈ సదస్సులకు తప్పక హాజరై, రైతులడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. చంద్రబాబు స్వయంగా ప్రతిరోజూ రెండు జిల్లాల సదస్సులలో పాల్గొంటారు. ఈ సదస్సుల కోసం పదికోట్లు ఖర్చు పెట్టబోతున్నది ప్రభుత్వం.

నీళ్ల సంఘాలకు హడావుడిగా ఎన్నికలు జరిపించడంలోనూ ప్రభుత్వ వుద్దేశ్యం అదే! అధికార పార్టీ కాబట్టి, సరైన సమయం ఇవ్వడం లేదు కాబట్టి సహజంగానే ఈ సంఘాలు తెలుగు దేశం పరమౌతాయి. వీటి ద్వారా గ్రామాలలో తెలుగు దేశం పార్టీకి పటిష్టమైన నాయకత్వం లభిస్తుంది. ఎన్నికల సమయంలో దాని వుపయోగం అంతింత కాదు.

రైతుల పట్ల ఇంత శ్రద్ధ చూపిస్తున్న ముఖ్య మంత్రి — ఆంధ్ర రైతాంగానికి శాశ్వత అపకారం చేసే ఆల్మట్టి, తుంగ ప్రాజెక్టుల విషయంలో కర్నాటక దుందుడుకు తనాన్ని ప్రతిఘటించ లేకపోవడం విచారించ దగిన విషయం. కర్నాటక ప్రభుత్వం ఆంధ్ర అభ్యంతరాలను గడ్డి పరక క్రింద తీసి ప్రక్కన పారేసి ఆ రెండు ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసేస్తున్నది. ఇంకొక ప్రక్క మహారాష్ట్ర కూడా కృష్ణానది నీటిని అడ్డగించ బోతున్నది.

కొరవ 7 పేజీలో



మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి నుంచి జమీన్‌రైతు రామానాయుడు జయంతి సత్కారం స్వీకరిస్తున్న ఆర్‌జె రాజేంద్ర ప్రసాద్; ప్రక్కన నెల్లూరు ఎమ్పీ వి. లక్ష్మీ. తూపిలి వనమాలి; ఇటువైపు మాజీ ఎమ్మెల్యే రావిపాటి మహానంద, తిరుపతి ఎమ్పీ ఎన్. సుబ్రహ్మణ్యం.

# పత్రికారంగం హృదయంలేని వ్యాపారమైంది!

జమీన్ రైతు వ్యవస్థాపకులు స్వర్గీయ నెల్లూరు వెంకట్రామా నాయుడు జయంతి సన్మానం 3 తేది సాయంత్రం టౌన్‌హాల్‌లో హార్దికంగా • జరిగింది. క్రీడలు, చిన్న పరిశ్రమల మంత్రి శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి అధ్యక్షించారు. జయంతి సత్కారం — హిందు ఆంగ్ల దినపత్రిక హైదరాబాదు బ్యూరో ఛీఫ్ శ్రీ ఆర్‌జె రాజేంద్ర ప్రసాద్ స్వీకరించారు.

వ్రాతలోనే కాదు — ఉపన్యాసంలోనూ ఘటికు లన్పించు కున్నారు శ్రీ రాజేంద్ర ప్రసాద్. సాధారణంగా జర్నలిస్టులు వేదికపై రాణించ లేరు. కానీ ఆయన మాత్రం తన వార్తా రచన శైలిలోనే తాను చెప్పదలచు కొన్న భావాన్ని క్లుప్తంగా, సూటిగా, స్పష్టంగా చిన్నచిన్న మాటలతో ఆవిష్కరింప జేశారు. రాజేంద్ర ప్రసాద్ ప్రసంగం పాత్రికేయ రంగంలోని వారందరినీ ఆలోచింప జేసే తీరులో వుండింది. వర్తమాన వార్తా ప్రచురణా విధానాల పట్ల ఎంతో ఆవేదనతో, విమర్శ నాత్మకంగా మాట్లాడారు.

**రామానాయుడు జయంతి సన్మానంలో 'వార్తా విశ్లేషణ'!**

పత్రికా రంగంలో సాంకేతిక అభివృద్ధి పెరిగే కొద్దీ — వార్తలలో యాంత్రికత తప్ప, హృదయం కన్పించడం లేదన్నారు శ్రీ రాజేంద్ర ప్రసాద్. కేవలం ఆంధ్ర పత్రిక, ఆంధ్ర ప్రభలు మాత్రమే వెలువడే రోజులలో మధ్యాహ్నం మూడు గంటలకే పత్రిక ప్రింట్ చేసి పంపేవారు. ఒక సంఘటన జరిగిన తరవాత రెండు రోజులకు కాని ఆ వార్త పాఠకులకు అందేది కాదు. కాని ఇప్పుడు రాత్రి రెండు గంటలకు జరిగే సంఘటనలు తెల్లవారి ఐదు గంటలకు ఫోటోలతో సహా పాఠకుల ముందుం టున్నాయి. గంటకు నలభై వేల కాపీలు ప్రింట్ చేసే మిషన్లూ వచ్చాయి. హిందు పత్రికైతే మాస్టర్ కంప్యూటర్‌ల ద్వారా పేజింగ్ టెక్నాలజీ ప్రవేశ పెట్టింది. ఏ ఎడిషన్‌లో తయారైన న్యూస్ స్టోరీ అయినా సెకండ్ల వ్యవధిలో కంప్యూటర్‌లోకి ఎక్కించి వాడుకోవచ్చు. ఇంకొక ప్రక్క టెలివిజన్లు ప్రజల దినచర్యలో ఒక భాగమై పోయాయి. వాటి ద్వారా పార్లమెంట్‌లోనో, క్రికెట్ గ్రౌండ్‌లోనో జరిగే విశేషాలను తమ ఇళ్లలోనే కూర్చుని అప్పటి కప్పుడు

కొరవ 7 పేజీలో

# స్వదేశీ కంపెనీలను చావుదెబ్బ తీస్తున్నారు!

బొంబాయి షేర్ ఇండెక్స్ కొద్ది కొద్దిగా పెరుగు తూంది. కొన్ని విదేశ ఇన్వెస్ట్ మెంట్ సంస్థలు గతవారం నుంచి విపరీతంగా షేర్లు కొనుగోలు చేయడమే దీనికి కారణం. మార్కెట్‌లో వారు ఒక క్రమ పద్ధతిలో షేర్లు కొంటున్నారు. కాని వారు కొనే షేర్లన్నీ బహుళజాతి సంస్థలవే కావడం గమనార్హం. కాల్గేట్, గ్లాక్సో, హిందుస్థాన్ లివర్, నెస్లే, క్యాడ్‌బరి, క్యాస్ట్రాల్, రికిట్ అండ్ కోల్‌మన్ వంటి కొన్ని ఎంపిక చేసిన షేర్లను మాత్రమే వీరు కొంటున్నారు. వీటిలో చాలా కంపెనీల పరిస్థితి బాగా లేదు. గత ఆర్థిక సంవత్సరంలో ఏ మాత్రం సంతృప్తికర ఫలితాలు ప్రకటించలేని కాల్గేట్, నెస్లే, క్యాడ్‌బరి కంపెనీల షేర్లు వీరు కొనటం, దానితో వాటటి ధరలు పెరగడం చిత్రంగా వుంది.

భారతీయ పారిశ్రామిక రంగాన్ని సంక్షోభంలోకి నెట్టె పెద్ద కుట్ర ఏదైనా జరుగు తున్నాదా అనే సందేహం కల్గుతున్నది ఈ పరిణామం వల్ల. పెద్ద కంపెనీల నిర్వహణకు భారతీయ యాజమాన్యాలు తగినవి కావని; వారందరు పనికి రారని ఒక దురభిప్రాయం కల్గించ డానికే ఈ సంస్థలు ఈ పనిచేస్తున్నాయా అని సందేహించ వలసి వస్తూంది. ఈ అనుమానానికి కారణం – వీరు రిలయన్స్, ఐటిసి, స్టేట్ బ్యాంక్ వంటి ఫండమెంటల్‌గా బలీయంగా వుండే షేర్ల జోలికి వెళ్లక పోవడం. టెల్కో మున్నటి ఆర్థిక సంవత్సరానికి మంచి ఫలితా లిచ్చినా షేర్ ధర కనీసం రూ.10లు కూడా పెరగలేదు. అదే సమయంలో

> **విదేశీ సంస్థల నిధుల పైనే షేర్‌మార్కెట్ ఆధారపడడంతో టాటా, బిర్లాలనూ అణగద్రొక్కడానికి ప్రయత్నం జరుగు తోంది! ఇది చాలా ప్రమాదకరం!**

బహుళ జాతి సంస్థల షేర్ ధరలు రూ.40 నుంచి 50 వరకు పెరిగాయి. ఒక్క టాటా టి మాత్రమే రూ.273 నుంచి 345కి పెరిగింది. ఇందుకు కారణం ఈ కంపెనీని తమ స్వాధీనం చేసుకోవ డానికి హిందుస్థాన్ లివర్ రెడీగా వుండడమే!

విదేశీ కొనుగోలు దారులు కేవలం బహుళ జాతి సంస్థల పైనే తమ దృష్టి కేంద్రీకరి స్తూంటె – స్వదేశీ తసంస్థలు స్టేట్ బ్యాంక్, రిలయన్స్ వంటి షేర్లతో మాత్రమే లావాదేవీలు జరుపు తున్నాయి. స్టాక్ ఎక్చేంజిలలో లిస్ట్ అయివున్న కొన్ని వేల బి–గ్రూప్ కంపెనీల గతి ఎవరూ పట్టించు కోవడం లేదు. రెండు రోజుల క్రితం ఎల్‌ఎంఎల్ వెస్పా కంపెనీ మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. కాని షేర్ ధర మాత్రం కేవలం 47 నుంచి రూ.50లకు పెరిగింది. సత్యం కంప్యూటర్స్ అంత గొప్ప లాభాలు చూపించినా షేర్ రూ.80ల దగ్గరే నిల్చిపోయి వుంది.

షేర్ ధరలు ఇంతగా సంక్షోభితం కావడానికి, స్వదేశీ కంపెనీలు సమస్యలలో పడడానికి బహుళ జాతి సంస్థలతో పాటు, యుటిఐ పాత్ర కూడా వుంది. ఏ షేర్ ధర అయినా కొద్దిగా పెరిగితే, ఇన్వెస్టర్ దాన్ని ప్రక్క రోజు పేపర్‌లో చూసుకొనే లోపలే యుటిఐ విపరీతంగా అమ్మకాలు చేసేస్తుంది. దానితో ధరలు తిరిగి పడిపోతున్నాయి. దేశ క్షేమం కాపాడ వలసిన ఒక ప్రభుత్వ రంగ సంస్థ ప్రజల ప్రయోజనాలకు భంగకరంగా ప్రవర్తించడం శోచనీయం. యుటిఐ,

కొరవ 11 పేజీలో



రామానాయుడు జయంతి సభకు రాజేంద్ర ప్రసాద్‌ను స్వాగతిస్తున్న జమీన్‌రైతు మేనేజర్ తూపిలి వనమాలి

# రియల్ ఎస్టేట్ ధరలు పెరిగి పోయేట్లున్నాయి!

రెండేళ్ల నుంచి స్లంప్‌లో వున్న రియల్ ఎస్టేట్ ధరలు మళ్లీ పెరిగే సూచనలు కన్పిస్తున్నాయి. రూపాయికి రెండేళ్ల లోపల పూర్తి కన్వర్టబిలిటి ఇస్తామని కేంద్ర ప్రభుత్వం సూచించడంతో, ఆర్‌బిఐ నియమించిన కమిటీ కూడా ఇందుకు సిఫార్సు చేయడంతో విదేశీ బ్యాంకులు మన దేశంలోకి ప్రవేశించ బోతున్నాయి. వారు కేవలం 5 శాతం (కొంచెం ఎక్కువగా పావలా) వడ్డీకి అప్పు లివ్వడానికి సిద్ధపడతారు. దానివల్ల భారతీయ బ్యాంకులు పతనమై పోతాయి. అంత

**షేర్‌కాలం**

**డాక్టర్ ఎ. దుర్గాప్రసాద్**

తక్కువ వడ్డీకి డిపాజిట్లు సేకరించడం మన బ్యాంకులకు అలవి కాదు. జపాన్

కొరవ 11 పేజీలో


# శ్రద్ధాంజలి

మాకు మార్గదర్శి
మా అభివృద్ధికి కారకులు

**డాక్టర్ పి. రఘురామిరెడ్డిగారు**

(రఘురామిరెడ్డి కంటి ఆసుపత్రి –
వి.ఆర్.సి. సెంటర్, నెల్లూరు)

పరమపదించి 11.6.97 తేదికి
5 సంవత్సరాలు గడిచాయి.

**పంచమ వర్థంతి**

సందర్భంలో వారి పవిత్రాత్మకు చిరశాంతిని కలుగజేయమని
భగవంతుని ప్రార్థిస్తున్నాము.

పి. శ్యామలమ్మ – భార్య

కుమారులు – కోడళ్లు
పి. జగదీష్‌రెడ్డి – మైథిలి
డా. పి. మహేష్‌రెడ్డి – గాయత్రి

కుమార్తె – అల్లుడు
డా. ఇ. మాధవి – ఇ. అరుణ్





**ఉచిత నేత్ర చికిత్సా శిబిరము**

**రఘురామిరెడ్డి కంటి ఆసుపత్రి**

**(జ్యోతి నర్సింగ్‌హోమ్)**

వి.ఆర్.సి. సెంటర్, నెల్లూరు

స్వర్గీయ
డాక్టర్ పి. రఘురామిరెడ్డిగారి
పంచమ వర్థంతి సందర్భంగా

వారి కుమారుడు

**డాక్టర్ పి. మహేష్‌రెడ్డి,**
M.S., D.O.M.S.,

వారి బృందంచే 11.6.97 తేది బుధవారం ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు పరీక్షలు, అవసరమైన వారికి అద్దములు, మందులు ఉచితం. అవసరమైన వారికి 13.6.97 తేది ఉచితముగా ఆపరేషన్లు చేసి కంటి అద్దములు ఇవ్వబడును.

ఈ సదవకాశమును ప్రజలు ఉపయోగించుకో వలసిందిగా ప్రార్థన.

11 తేది ఉదయం 7 గంటల నుండి 9 గంటల లోపల తమ పేర్లను నమోదు చేసుకున్న వారికి మాత్రమే చికిత్స జరుపగలము.

# కనుపూరు కాలువలో నిజంగానే నీళ్లు పారేట్లున్నాయి!

జిల్లా రైతాంగానికి ప్రాణ ధానం వంటి మూడు కీలకమైన పారుదల కాలువలను జన్మభూమి పథకం క్రింద ఆధునీకరించ నున్నామని కలెక్టర్ డాక్టర్ సాంబశివరావు ప్రకటించారు; దగదర్తి - ముంగమూరు; సోమశిల - కావలి; సోమశిల - కనుపూరు కాలువలు మూడింటిలోనూ పూడిక తీసి, చెత్త చెదారం తొలగించి, తెగిన గట్లు పూడ్చి నీరు సక్రమంగా పారేలా చూస్తారు. ఇందులో దగదర్తి కాలువ పనులు మొదలైనాయి. కనుపూరు కాలువ పనులు 7 తేది ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మడమనూరు గ్రామంలో కనుపూరు కాలువ రైతు సదస్సు జరిగింది. ఈ సభలో కలెక్టర్ మాట్లాడుతూ - కనుపూరు కాల్వ తాత్కాలిక మరమ్మత్తులకు 26 లక్షలు ఖర్చు అవుతాయని ముందు అంచనా వేసారని; కాని శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు 80 లక్షలు ఖర్చు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇందులో 30 శాతం, అంటె 25 లక్షల రూపాయలు రైతులు భరించా లన్నారు. దీని కోసం ఎకరాకు 150 రూపాయల వంతున రైతులు చందాలు వేసుకుంటె ప్రభుత్వం తన వాటాగా 55 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. కాలువ క్రింద వున్న 38 గ్రామాలను 6 కేంద్రాలుగా విభజించామని, గ్రామ కమిటీలు ఏర్పడి డబ్బు వసూలు చేసి రైతులకు రశీదు లివ్వాలని కోరారు. పనులు సక్రమంగా నాణ్యతతో జరిగేలా చూసుకో వలసిన బాధ్యత రైతులదే నన్నారాయన. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో రాపూరు శాసన సభ్యుడు ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, ఇరిగేషన్ ఎస్‌ఇ నాగరాజు, గూడూరు ఆర్డిఓ కె. శ్రీనివాస రాజు, రైతు నాయకులు చిట్టేటి రమణా రెడ్డి, పి. దశరథ రామయ్య కూడా

## జిల్లావార్తలు

పాల్గొన్నారు.

కనుపూరు కాలువలో నీళ్లు పారడం మనం బ్రతికుండగా చూడగలమనే ఆశ ఇప్పటి వరకు లేదు. మూడు మూడు అడుగుల మట్టమైనా కాలువలో దిగువ వరకు నీళ్లు పారాలంటె - మొత్తం కాలువ లెవలింగ్‌లు సరిచేయాలి. కొత్తగా కాలువ త్రవ్వినంత పనది. కాంట్రాక్టర్లు తూకమాలిష్‌గా మట్టితోడి వెళ్లి పోవడంతో ఇన్నేళ్ల నుంచి దండగగా పడివుందది. రైతులందరూ తలా ఒక చెయ్యి వేసుకొని దాన్ని సరిదిద్దుకోగల్గితే - కనుపూరు కాలువలో నిజంగానే నీళ్లు పారుతాయి.

### పెంచలకోనలో దొంగల భయం

పుణ్య క్షేత్రమైన పెంచలకోనలో ఇటీవల దొంగల భయం ఎక్కువయ్యింది. నెల వ్యవధిలో మూడు చోరీలు జరిగినా పోలీసులు పట్టించుకొన్న పాపాన పోలేదు. పెంచల నరసింహుని దర్శనానికి వచ్చే భక్తులకు బస చేసేందుకు కోనలో ఎటువంటి వసతులూ లేవు. చెట్ల క్రిందనో, అడవిలోనో కాసేపు విశ్రాంతికి ప్రయత్నించి నప్పుడు ఈ దొంగ తనాలు జరుగు తున్నాయి. కొందరు యువకులు ఒక ముఠాగా ఏర్పడి అడవిలో సేద దీరుతున్న మహిళలను కత్తులతో బెదిరించి వారిమెడలోని ఆభరణాలను తీసుక వెళుతున్నారు. రాపూరు పోలీసులకు పలు ఫిర్యాదులు అందినా పట్టించుకొనే నాధుడే లేడు. పెంచలకోనలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేసే విషయాన్ని ఎస్పీగారు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

### తారుమారైన ఫలితాలు

తోటపల్లి గూడూరు

కొరవ 8 పేజీలో

# ఆత్మకూరులో చీప్‌లిక్కర్ - కావలిలో పబ్లిక్ బార్లు!

ఆత్మకూరులో మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లు తూంది. అడిగే నాథుడే లేకపోవడం వల్ల మద్యం దుకాణాల్లో చీప్ లిక్కర్ కూడా విక్రయి స్తున్నారు. షాపుల వాళ్లు ఎక్సైజ్ శాఖాధికారులకు కోరినంత మామూళ్లు ఇస్తుండడంతో నిబంధనల గూర్చి అధికారులు ఆలోచించడమే లేదు. శెలవు దినమైన మంగళ వారం, 1 తేది కూడా షాపులు తెరిచే వుంటున్నాయి. అర్ధరాత్రి సమయంలో కూడా ఆత్మకూరులో మద్యం దొరుకు తూంది. దీనివల్ల లేనిపోని సమస్యలు తలెత్తు తున్నాయి.

***

మద్య నిషేధాన్ని ఎత్తి వేయడంతో త్రాగుబోతులకులభించిన స్వేచ్ఛ, కావలిలో అనేక గొడవలకు కారణమౌ తూంది. నిబంధనల ప్రకారం స్కూళ్లు, పార్కులకు దూరంగా మద్యం షాపులు ఏర్పాటు చేయాలి. కాని దీనికి విరుద్ధంగా స్కూళ్లకు దగ్గరగా షాపులు పెట్టారు. శెలవు దినమైన మంగళ వారం కూడా మద్యం విక్రయాలు యధేచ్ఛగా జరుగు తున్నాయి. మద్యాన్ని షాపుల్లో త్రాగడం నిషేధించినా - బ్రాందీ షాపుల వెనుక వైపు గదులను బార్లుగా వినియోగిస్తున్నారు. కొందరు మందు బాబులు మితిమీరిన ఉత్సాహంతో కౌంటరు వద్ద, షాపుల ప్రక్కన ఉన్న కూల్‌డ్రింక్, కిల్లీషాపుల్లో బహిరంగంగా త్రాగి గలభా చేస్తున్నా పట్టించుకొనే అధికారి లేడు. దీనివల్ల దారిన వెళ్లే మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కావలిలో లైసెన్సులు లభించిన నాలుగు అంగళ్లూ తెలుగు దేశం నాయకులవే కావడంతో పోలీస్, ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లున్నారు. ఇంటికి మందు పట్టుకెళ్లి త్రాగలేనివారికి కోర్టులు, పార్కులు బాగా వుపయోగ పడుతున్నాయి. చీకటి పడగానే బహిరంగ ప్రదేశాల్లో చేరి మందు సేవిస్తున్నారు. ఆర్టీసి బస్టాండు, రైల్వే స్టేషన్‌లు సైతం బార్లుగా

## మద్యం లీలలు వర్ణించ తరమా?

మారిపోయాయి. రాత్రి 8 గంటలకు కావలి టౌన్‌లో ఏ షాపూ మూతపడడం లేదు.

### మద్యం దుకాణాలకు టెండర్లు

జిల్లాలో మిగిలి పోయిన మూడు మద్యం దుకాణాలను 9 తేది కలక్టరేట్‌లో వేలం వేస్తారు. కోవూరు పల్లి, పూటుకూరు, సిద్ధిపురం గ్రామాల్లో షాపులను ఇప్పటి వరకు ఎవరూ పాట పాడలేదు. 9 తేది ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు టెండర్లు దాఖలు చేసుకో వచ్చని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కెఎన్ రెడ్డి చెప్పారు.


VUTUKURU BRAHMA REDDY RESIDENTIAL SCHOOL

ఊటుకూరు బ్రహ్మారెడ్డి రెసిడెన్షియల్ & డే స్కూల్

4వ మైలు, ముత్తుకూరు రోడ్డు, నెల్లూరు, ఫోన్: 328175



కరస్పాండెంట్
ఊటుకూరు బ్రహ్మారెడ్డి

డైరక్టర్లు
V. శ్రీనివాసులు రెడ్డి, B.E.,
సివిల్ ఇంజనీర్

V. శైలజ, B.Sc.,

Dr. V. సత్యనారాయణ రెడ్డి
BDS., FCIP.,
డెంటల్ సర్జన్

Dr. V. ఉమాభాను, BDS.,

* సువిశాలమైన స్థలం, ఆహ్లాదకరమైన వాతావరణం, పెద్ద ప్లే గ్రౌండ్ సౌకర్యం.
* క్లాసుకు 25 మంది విద్యార్థులు మాత్రమే.
* వ్యాను సౌకర్యము కలదు.
* కేరళ మరియు తమిళనాడుకు చెందిన అనుభవజ్ఞులైన అధ్యాపకులచే క్రమశిక్షణతో కూడిన అత్యుత్తమ విద్యా బోధన.
* స్పోకన్ ఇంగ్లీష్‌కు అత్యంత ప్రాధాన్యత.
* అందరికీ అందుబాటులో అతి తక్కువ ఫీజులు.

LKG నుండి VIII క్లాస్ వరకు ఇంగ్లీష్ మీడియంలో అత్యుత్తమ విద్యా బోధన

అడ్మిషన్లు జరుగుచున్నవి - సీట్లు పరిమితం

# రంభ, సుందర్ సాన్నిహిత్యంతో కుష్బూ మనసులో గిలి!

తన కాబోయే భర్త డైరెక్టర్ సుందర్ మనసు క్రమక్రమంగా రంభవైపు మరలిందేమోనని కుష్బూతో శంకిస్తున్నదిప్పుడు; అతను దర్శకత్వం వహించే చిత్రాలలో రంభను తప్పనిసరిగా బుక్ చేయిస్తున్నాడు." ఉళ్ళత్తై అళ్ళాదే, అరుణాచలం" చిత్రాల తర్వాత సుందర్ దర్శకత్వం వహించే "జానకిరామన్" అనే మరో తమిళ చిత్రంలోనూ రంభ బుక్ అయింది. పైగా, ఇటీవల ఎ.ఎం. రత్నం నిర్మించడానికి తలపెట్టిన చిత్రంలోనూ డైరెక్టర్ సుందర్ నాయికగా రంభనే బుక్ చేయించాడు. నిప్పులేనిదే పొగరాదు. పొగ చూరుతున్న కుష్బూ మనసుకు ఇంతకన్నా కారణం మరేం కావాలి? కుష్బూకు అసలు కునుకే పట్టడం లేదట!

## హాస్య నటులతో "అందరూ హీరోలే"

డి. రామానాయుడు చిత్రం "సూపర్ హీరోస్" విజయవంతం కావడంతో ఆ బాణీలోనే హాస్య నటులతో "అందరూ హీరోలే" చిత్రం ప్రారంభించబడింది. బ్రహ్మానందం, తనికెళ్ళ భరణి, చంద్రమోహన్, ఆలీ, శివాజీరాజా, కళ్ల చిదంబరం, గుండు హనుమంతరావులతో పాటు నాయికగా ఒక కొత్తనటి పరిచయం గావింపబడుతూంది. సంగీతం" శ్రీ. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఉమాకాంత్

## "గోకులంలో సీత"

"గోకులత్తై సీత" తమిళ చిత్రం ఆధారంగా ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో తయారౌతున్న "గోకులంలో సీత"లో పవన్ కళ్యాణ్, రాశి, హరీష్, సుధాకర్, బ్రహ్మానందం, కోట శ్రీనివాసరావు, రాళ్ళపల్లి అచ్యుత్, శ్రీహరి, మల్లికార్జునరావు నటిస్తున్నారు. మాటలు: పోసాని కృష్ణమురళి. సంగీతం: కోటి.

## "తాంబూలాలు"

"జాతకాలను నమ్మే వారున్నారు కాని, మరీ అంత గుడ్డిగా నమ్మడమా? ఇద్దరు ప్రేమికుల మధ్య జాతకాలపై నమ్మకం ఎలాంటి ప్రభావం చూపిందన్న ఇతి వృత్తంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం." అన్నారు సాయిప్రకాష్. ఈయన దర్శకత్వం వహిస్తున్న "తాంబూలం" చిత్రంలో నవీన్, సౌందర్య, కోట శ్రీనివాసరావు, చలపతిరావు, శ్రీహరి, శ్రీమాన్, అన్నపూర్ణ, కల్పనారాయ్, శకుంతల, రాగిణి, ప్రియ నటిస్తున్నారు.

## "పరదేశి"

కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో ఇద్దరు కొత్త హీరోలు, ఇద్దరు కొత్త హీరోయిన్‌లతో పరదేశం అంటే, అమెరికాలో తయారౌతుంది. రచన: సత్యానంద్. సంగీతం: కీరవాణి. ఈ చిత్రం తమిళంలోనూ రూపొందుతుంది.

■



కోడలు దిద్దిన కాపురం చిత్రంలో వినీత



అన్నమయ్య చిత్రంలో సుమన్

# "అబార్షన్ అని అనుమానించకండి"

"ఉష్ అబ్బ! ఏం ఎండలో!" అని జ్యోతిలక్ష్మి ఒక ప్లాస్టిక్ విసన కర్రతో విసురుకుంటూ కన్పించింది; దగ్గరకు వెళ్తే - "మాకాలంలో ఇలాంటి వేసవి తాపంలో హాయిగా ఏ ఊటీలోనో షూటింగ్‌లు ఏర్పాటు చేసేవారు." అందామె.

ఆమెను పలకరించి, మాటల్లో మాటగా "ఒక వదంతి విన్నాను. అది ఎంత వరకు నిజమో తెలుసుకోవాలని వుంది అన్నాను."

"వదంతి అని మీరే అంటున్నారుగా? చెప్పండి అదేమిటో"! అంది జ్యోతిలక్ష్మి.

"మీ అమ్మాయి జ్యోతిమీనా తరచు ఒక హాస్పిటల్‌కు వెళ్లొస్తున్నదని వినికిడి"?

"కొంపదీసి 'అబార్షన్' అనుకుంటున్నారా?" అంటూ జ్యోతిలక్ష్మి నవ్వి." అలాంటిదేమీ లేదు. అమ్మాయి కాస్త సన్నబడాలని మద్రాసులో నుంగంబాకంలోని ఒక హెల్త్ సెంటర్‌కు పంపిస్తున్నాను. అంతే మరేమికాదు. దాని వల్ల బాగా నాజూకుగా తయారౌతున్నది కూడా." అంది.

**జ్యోతిమీనా ఆస్పత్రికి ఎందుకెళ్తున్నట్లు?**

## ముగ్గురు 'ర'లు

అవును రంభ, రవళి, రమ్య... ముగ్గురి పేర్లకూ మొదటి అక్షరం 'ర'; రాత్రిళ్లు మీరేమి చేస్తారో చెప్పమని వారు ముగ్గుర్నీ అడిగితే, ఇలా అన్నారు:

రంభ... "నేను నిద్రపోయే ముందు ఒక గ్లాసు ఐస్ వాటర్ తాగుతానంతే... మెత్తని పరుపుమీద అలా నడుంవాల్చగానే నిద్ర ముంచుకొచ్చేస్తుంది. ఒక్కోరోజు కలలో పాములు కనిపిస్తాయండి. ఫలితమేమిటో తెలుసుకోవాలి.

రవళి... "మా అమ్మ పక్కన పడుకుంటేనే నాకు నిద్ర వస్తుంది. ఒక అరటి పండు, ఒక కప్పు బాదం పాలు సేవిస్తాను. అంతే తెల్లవారే వరకు మెలకువ రాదు. కలలు అసలేరావు".

రమ్య... "సోఫాలో పడుకొని అలా టి.వి. చూస్తూ చూస్తూ నిద్రా

కొరవ 11 పేజీలో

# అన్నమయ్యకు కూడా అసభ్యత జోడించడం హేయాతి హేయం!

ఎందరో మహానుభావులు, మహా పతివ్రతలు, మహా వీరులు, మహా భక్తులు మనదేశంలో పుట్టి పెరిగి ఆదర్శ వంతమైన సంస్కృతికి పునాదులు వేశారు. అటువంటి ఉదాత్తమైన చరిత్ర కల్గిన మహాపురుషులలో స్మరించ తగినవాడు - పదకవితా పితామహుడు, సంకీర్తనా చార్యుడైన అన్నమాచార్యుడు. ఆయన దాదాపు ఐదు వందల సంవత్సరాల క్రితం వాడు.

భౌతికమైన భోగభాగ్యాల కోసం కవి పండితులు ప్రభువులను ప్రస్తుతించటం పరిపాటిగా వున్న ఆ రోజుల్లో, అన్నమయ్య తన నాలుకను పరమాత్మునికి అర్పించి ఆయన్నే సదాకీర్తించాడు. వెంకటేశునికి అర్పించిన వాక్కుతో విన్ను స్తుతించలేనని తనకు ఆశ్రయమిచ్చిన సాళ్వ నరసింగరాయ రాజుకు ఖచ్చితంగా చెప్పి, ఆయన ఆగ్రహానికి గురై, చెరసాలలో బంధింపబడ్డాడు. ఆ సమయంలో అన్నమయ్య ఆర్తితో వెంకటేశుని కీర్తించే సరికి చేతి సంకెళ్లు తెగి క్రిందపడ్డాయి. రాజు తన తప్పు తెలుసుకొని క్షమాభిక్ష కోరి అన్నమయ్య కృపకు పాత్రుడవుతాడు.

**చిత్రసమీక్ష**

**□□**

**గ్రిద్దలూరు గోపాలరావు**

అలవేలుమంగ వెంకటేశ్వరుల అనుగ్రహంతో వేలకొలది సంకీర్తనలు మనకందించిన అన్నమయ్య పవిత్ర భక్తికి ప్రతి రూపం.

కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాక గ్రామంలో 1408లో విశాఖ నక్షత్రంలో హరినందకాంశంలో పుట్టి పెరిగిన అన్నమయ్య యదార్థ జీవిత గాథకు ఆధారం - ఆయన మనవడు చిన తిరుమలాచార్యుడు వ్రాసిన ద్విపద గ్రంథం. సాహిత్యోపాసకులకు, వాఙ్మయ పరిశోధకులకు తప్ప రామాయణ, భారత కథల్లా అన్నమయ్య జీవిత కథ అందరికీ తెలియదు. అందువల్ల ఆ వాస్తవకథా రూపాన్ని "అన్నమయ్య" చిత్రంలో చూపివుంటే అందరికీ

తరువాయి 11 పేజీలో

# ఇద్దరు ఒక్కరుగా కన్పిస్తే మందు మోతాదు తగ్గినట్లా?

**ఈ ప్రశ్నకు బదులేది?**

ఒక హాస్య నటుడు - ఎవరయితేనేం _ హైదరాబాద్‌లో కొత్తగా వెలిసిన ఒక "బార్"లో కూర్చొని, అదే పనిగా మద్యం సేవించసాగాడు. ఎదురుగా కూర్చొనున్న ఒక బట్టతల మనిషి "మీరు ఒక్కపలచగా ఉన్నారు. జాగ్రత్త! మోతాదు మించితే ఆరోగ్యం " మోతాదు అంటే ఏమిటో!" పాడవుతుంది సుమండీ," అన్నాడు.

అన్నాడు హాస్య నటుడు.

"ఆ మూల ఇద్దరు కూర్చొని తాగుతున్నారు చూడండి. వాళ్లు నలుగురుగా కనిపిస్తే, మీరు తాగడం మానెయ్యాలన్న మాట".

"మరి, ఆ ఇద్దరూ నాకు ఒక్కరిగానే కనిపిస్తున్నారే! ఇప్పుడు చెప్పండి నేనెంత వరకు తాగొచ్చు!" అన్నాడా హాస్య నటుడు ఆరో పెగ్గు పుచ్చుకుంటూ!

# శ్రద్ధాంజలి



జననం
21.9.1918

మరణం
29.5.1997

## శ్రీ గునుపాటి రామచంద్రారెడ్డి గారు

మాజీ శాసనమండలి సభ్యుడు, నెల్లూరు

29.5.1997 తేది స్వర్గస్థులైనారు.
వారి పవిత్రాత్మకు చిరశాంతి కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

### పెద్దకర్మ

11.6.1997 తేది బుధవారం, నెల్లూరు, పొగతోటలోని మా స్వగృహమున జరుగును.
బంధుమిత్రులు తెలియగోరుతాము.

---

భార్య : కాంతమ్మ

కుమారులు – కోడళ్లు
పద్మనాభరెడ్డి – అరుణ
శ్రీధర్ రెడ్డి – ఉమ

చెల్లెలు – బావమరిది
పద్మావతమ్మ – డి. చెంచురామి రెడ్డి

*మరియు కుటుంబ సభ్యులు*

కుమార్తెలు – అల్లుళ్లు
రాజేశ్వరి – టి. రాజగోపాల రెడ్డి
వసుంధర – ఆర్. ద్వారకనాథ్ రెడ్డి
శారద – బి. కుమారస్వామి రెడ్డి

తమ్ముళ్లు – మరదళ్లు
శ్రీనివాసులు రెడ్డి – సులోచన
రంగా రెడ్డి – శాంతమ్మ